రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మరిన్ని దా'రుణాలు'

రోజుకొకటి చొప్పున వెలుగులోకి ...
ట్రాక్టర్లు పోయాయి..అప్పులు మిగిలాయి
అధికారపార్టీ నేత నివాసానికి చేరిన వాహనాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాయ మాటలతో పేదలపై విసిరిన అప్పుల వల దా'రుణాలు' రోజుకొకటి చొప్పున వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అమాయకత్వాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి పేరుపై ట్రాక్టరు రుణాలు తీసుకుని, అప్పు చెల్లించలేదని రికవరీ చేసి, అప్పులు మాత్రం వారి నెత్తిన పెట్టిన ఘటనలు కదిరి ప్రాంతంలో నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ట్రాక్టరుపోయి అప్పులు మిగిలాయంటూ బాధితులు లబోదిబో మంటూ పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు.

ట్రాక్టరు తీసుకెళ్లారు...అప్పు మిగిలింది

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ కింద ట్రాక్టరు ఇస్తున్నామని నమ్మబలకడంతో తనకల్లు మండలంలోని గుంజువారిపల్లి గ్రామానికి చెందిన దళిత గంగాధర కోటక్ మహీంద్ర ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకుని మహీంద్ర 475 ట్రాక్టరును తీసుకున్నాడు. సకాలంలో ఇఎంఐ చెల్లించలేదంటూ ట్రాక్టరు షోరూమ్‌కు సంబంధించిన ప్రతినిధి నరసింహులు అనే వ్యక్తి వెళ్లి ట్రాక్టరును వెనక్కు తీసుకొని వచ్చాడు. దీన్ని సంస్థకు అప్పజెబితే అప్పు ఉండదని చెప్పడంతో ఇవ్వడానికి గంగాధర అంగీకరించాడు. కాని దాన్ని సంస్థకు కాకుండా కడప జిల్లాకు చెందిన ఒక అధికారపార్టీ నాయకుడికి అమ్మి, తనకు రూ.30 వేలు చేతిలో పెట్టినట్టు గంగాధర తెలిపాడు. అయితే గత వారంలో కోటక్ మహీంద్ర సంస్థ ప్రతినిధులు ఇంటి వద్దకొచ్చి అప్పు కట్టాలని తనను ఒత్తిడి చేసినట్టు బాధితుడు వాపోయాడు. విషయాన్ని నరసింహులు దృష్టికి తీసుకెళితే నీకేమవదంటున్నాడని అన్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో గురువారం సత్యసాయి జిల్లా ఎస్పీకి తన మొరను వినిపించేందుకు వెళ్లానన్నాడు. అక్కడ అధికారులు తన ఫిర్యాదును స్వీకరించి తనకల్లు పోలీసు స్టేషన్‌కు రెఫర్ చేశారని చెప్పాడు. తనను ఏదో రకంగా రుణ విముక్తుడిని చేయాలని గంగాధర వేడుకుంటున్నాడు. ఇలా ఇంకా అనేక ఫైనాన్స్ సంస్థలు, ట్రాక్టర్ షోరూమ్ యజమానులు కలిసి పేద రైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేసిన ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉండటం గమనార్హం.

అటు తెలంగాణ...ఇటు అధికారపార్టీ నేతల వద్దకు చేరిన ట్రాక్టర్లు

మాయ మాటలతో రైతుల పేరిట అప్పులిచ్చి ట్రాక్టర్లను వారికి అంటగట్టారు. అనంతరం అప్పు కట్టలేదని వెనక్కు తీసుకుని సంస్థ ఖాతాల్లోకి జమ చేయకుండానే నేరుగా ఈ ట్రాక్టర్లను తెలంగాణ రాష్ట్రానికి తరలించి విక్రయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గత నెలలో పోలీసులు అక్కడికెళ్లి విచారణ చేపట్టిన సమయంలోనూ అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు సమాచారం. ఒక్కో ట్రాక్టరును నాలుగు లక్షల రూపాయలకు అక్కడ విక్రయించినట్లు తెలిసింది. మరికొన్ని ట్రాక్టర్లు కడప జిల్లాకు చెందిన ఒక అధికారపార్టీ నాయకుడి నివాసానికి చేరినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన వద్ద వందల సంఖ్యలో ఫైనాన్స్ సంస్థకు సంబంధించిన ట్రాక్టర్లు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు అందుతున్నా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఈ రకంగా కదిరి ఒక్క ప్రాంతం నుంచే వందకు వరకు ట్రాక్టర్లను మాయం చేసినట్టు ఆరోపణలున్నాయి. స్థానికంగానున్న కొంత మంది దళారులు, ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు, ట్రాక్టర్ షోరూమ్ యజమానులు కలిసి ఆడిన నాటకంలో పేదరైతులు బాధితులుగా మారారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి గోరంట్ల, గోరంట్ల రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపులకు వచ్చిన ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారం గురించి తెలియజేయాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. కేస్‌షీట్, ఫైల్, బ్యాగ్‌లను ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలకు అవసరమైతే ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులను నియమించాలన్నారు. ఎక్కడా కూడా హడావుడిగా శిబిరాలను నిర్వహించరాదని చెప్పారు. ఒక ప్రణాళిక ప్రకారం శిబిరాలను నిర్వహించాలన్నారు. శానిటేషన్ వర్కర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్య సురక్ష శిబిరాలలో వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్లో ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్లోడ్ చేయించి లాగిన్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శృతి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ రాజు, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపిడిఒ రఘునాథగుప్త, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, సర్పంచి శివానంద, అగ్రి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసు అమరవీరుల వారోత్సవాలు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రారంభం కానున్నాయి. ఆ ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బంది రిహార్సల్స్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తారు.

సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలందించేందుకు సిఎం జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రజలకు వద్దకే పాలన అందుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని అన్నారు. ప్రజలు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్న నేపథ్యంలో వైసిపి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష టిడిపి నానా రాద్ధాంతం చేస్తోందన్నారు. టిడిపి నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ సురేష్‌కుమార్, ఇఒఆర్‌డి నాగరాజురావు, పంచాయతీ కార్యదర్శి నాగార్జునరెడ్డి, సర్పంచులు గిరిజమ్మ నాగరాజురావు, అంజి నాయక్, అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ రమణారెడ్డి, ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి అశోక్, వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు వేణు, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఫుడ్‌పై కంట్రోల్ నిల్..

పట్టణంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రెస్టారెంట్లు
స్ట్రీట్‌ఫుడ్‌లో నాణ్యత కరువు
తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

ఎలాంటి అనుమతులు లేని పట్టణంలోని ఓ రెస్టారెంట్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండతో సహ మిగిలిన పట్టణాల్లో కల్తీ ఆహారం రాజ్యమేలుతుంది. దీంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఒక్క హిందూపురంలోనే 20 దాదాపు రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో చాలావాటిని అనుమతులు లేవని తెలుస్తోంది. ఇక పోతే స్ట్రీట్ ఫుడ్స్ సెంటర్లు, బోజనం, టిఫిన్, హోటళ్లుఅధిక సంఖ్యలో ఉన్నటికి అనుమతులు మాత్రం పరిమితంగా ఉన్నాయి. వీరందరు పురపాలక సంఘంలో ట్రేడ్ లైసెన్స్ తీసుకుని ఇదే అనుమతి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రెస్టారెంట్లలో నాణ్యత లేక పోయినప్పటికీ అధిక ధరలతో పాటు తాగునీరు కూడా విక్రయిస్తున్నారు. రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, భోజన హోటళ్ల నిర్వాహకులు కూడా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఆరోజు రాత్రికి మిగిలిన ఆహారాన్ని ఫ్రిడ్జిల్లో నిల్వ ఉంచి తరువాతి రోజు విక్రయించడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది.

అనుమతి లేకుండా ఆహార విక్రయాలు

ప్రస్తుతం మార్కెట్లో ఆహార పదార్థాల బిజినెస్ ఊపందుకుంటుంది. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అనుభవం లేని చెఫ్‌ను పెట్టుకొని రెస్టారెంట్లు, హోటళ్లు నిర్వహిస్తూ ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. ఆహార పదార్థాల విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహార భద్రత అధికారుల నుంచి అనుమతులు పొందాలి. అయితే కొందరు ఇష్టారాజ్యంగా ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని సంపాదనే ధ్యేయంగా నాణ్యతలేని పదార్థాలు విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని పక్కనపెట్టి క్యాష్ చేసుకుంటున్నారు. పట్టణాలతో పాటు రహదారుల్లో దాబాలు, రెస్టారెంట్లు, భోజన, టిఫెన్ హోటళ్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంటే వీటిపై సంబందిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఆహార విక్రయ కేంద్రాలకు నిబంధనలు ...

ఆహార పదార్థాలు విక్రయించే రెస్టారెంట్లకు, భోజన హోటళ్లకు,కర్రీ పాయింట్లకు రిజిస్ట్రేషన్ తో పాటు, ఆహార భద్రత అధికారి నుంచి జారీ చేసిన లైసెన్స్ ఉండాలి. అధికారులు దాడుల సమయంలో ఆహార విక్రయ కేంద్రాల్లో అనుమతులు లేకపోతే ముందుగా నోటీసులను జారీ చేయాలి. ఆ తర్వాత కూడా అదే తీరు కొనసాగితే ఆ కేంద్రాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించాలి. అంతేకాకుండా ఏడాదికొకసారి నిర్ణీత సంఖ్యలో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలి. జిల్లాలోని ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలలో దీనికి భిన్నంగా కొనసాగుతుంటే అధికారులకు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ కరువు

నిల్వ ఉంచిన ఆహారాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంపై దెబ్బతీస్తున్న విక్రయదారులపై అధికారుల చర్యలు శూన్యమని చెప్పాలి. కల్తీ ఆహారాలు విక్రయం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఏమీ పట్టనట్లు వ్యవహరిచడం వల్ల కల్తీ రాకెట్లు రెచ్చిపోతున్నాయి. ఆహార భద్రత అధికారులు ఒక్కొక్కరు వారి పరిధిలో నిర్ణీత సంఖ్యలో ప్రజలు ఉపయోగించే నిత్యవసరాల్లో వాటి నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు నమూనాలను సేకరించాలి. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపించి వచ్చిన ఫలితాలు ఆధారంగా విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి. అయితే ఇలాంటి చర్యలు జిల్లాలో కన్పించడం లేదు. తూతూమంత్రపు దాడులతో మమ అనిపిస్తున్నారు. ప్రతి మండలానికి ఒక ఆహార భద్రత అధికారి ఉండి పర్యవేక్షణ చేస్తే ఫలితాలు ఉంటాయి. అయితే జిల్లాలో సిబ్బంది కొరత ఉందనిఆహార భద్రత అధికారులు గగ్గోలు పెడుతున్నారు. రెండు జిల్లాలకు ఇద్దరు అధికారులు ఉండడం, వీరే నమూనాలు సేకరించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా పని భారం ఎక్కువ కావడంతో దాడులు నామమాత్రంగా సాగుతున్నాయి.

ఒపిఎస్‌ను అమలు చేయాల్సిందే

ధర్మవరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలో నాయకులు

ప్రజాశక్తి హిందూపురం

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో హిందూపురం తహశీల్దార్ కార్యాలయ ఆవరణం వద్ద నిరవధిక నిరాహార దీక్షలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్ మాట్లాడుతు ప్రభుత్వం జిపిఎస్‌ను అమలులోకి తీసుకురావడం మోస పూరిత చర్య అని విమర్శించారు. ఒపిఎస్‌ను పునరుద్దరణకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాగవర్ధన్, హరి, మోడాల్ స్కూల్ మురళి, ఎపిటిఎఫ్ నాయకులు గురు రాజు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ముస్తాఫా, బాబు, రంగనాథ్, సురేష్, చలపతి, అనీల్, విజయ్ తదితరులు పాల్గోన్నారు.

ధర్మవరం టౌన్ : సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామకృష్ణనాయర్ ప్రారంభించారు. ఈ దీక్షల్లో యుటిఎఫ్ నాయకులు హరిశంకర్, రామాంజినేయులు, ఆంజనేయులు, వసంతం రామాంజినేయులు, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డిలు కుర్చొన్నారు. ఈసందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని మరచి అసెంబ్లీలో జీపీఎస్‌ను తీసుకురావడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీపీఎస్ ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒపిఎస్‌ను అమలు చేసే వరకు ఈ దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఈ దీక్షలకు సీపీఎం పట్టణ కార్యదర్శి నాగార్జున మద్దతు ప్రకటించారు.

నిరవధిక దీక్షల్లో యుటిఎఫ్ డిమాండ్

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, హనుమంతరావు, సకలచంద్రశేఖర్, సురేశ్ గోపాల్ రెడ్డి, మల్లేశ్, అమర్నాథ్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆదిరెడ్డి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, వెంకటరాముడు, బాబయ్య, ఆంజనేయులు, చిన్నవెంకటేశులు పాల్గొన్నారు.

పెనుకొండ: జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ పెనుకొండ శాఖ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపట్టారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పి 4 సంవత్సరాలు గడచిన తరువాత అవగాహన లేక సిపిఎస్ పై హామీ ఇచ్చామనిప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం విద్యారంగాన్ని తిరోగమనం వైపు తీసుకుపోతోందని విమర్శించారు. ఈ దీక్షలకు ఎపిజిఇఎ తాలూకా నాయకులు అబ్దుల్, చంద్ర సిపిఐ నాయకులు శ్రీరాములు, మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కార్యదర్శి నారాయణ స్వామి, జిల్లా కన్వీనర్ నరేష్ కుమార్, నాయకులు జి.రమేష్, రవీంద్రనాథ్, కష్ణా టి.రమేష్, నాయక్, నరసింహులు, తిప్పేస్వామి, దివాకర్,పీడీ , శేషాద్రి మారుతీ, గోపి, శీనా, రాజగోపాల్, పాల్గొన్నారు

మడకశిర : ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం దగ్గర మడకశిర మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.ఎన్. మాలింగప్ప, మూడ్లగిరియప్ప ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, గుడిబండ మండల అధ్యక్షులు డి. నరసింహప్ప, యుటిఎఫ్ నాయకులు బి. ఈశ్వరప్ప, నంజప్ప, కదురన్న, నరసింహమూర్తి, శివశంకర్, నాగేంద్ర నరసింహరాజు, సురేష్ కుమార్, సురేష్, సూర్య ప్రకాష్, సిఆర్‌పిలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఒపిఎస్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని జగన్మోహన్ రెడ్డి విస్మరించాలని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్షలను చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలకు రైతు సంఘం నాయకులు సుబ్బిరెడ్డి, సిఐటియు నాయకులు నర్సింహులు, జగన్ ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, ఎస్టియు నాయకులు ఆసిఫ్ ,ఖలీల్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షా శిబిరంలో సీనియర్ నాయకులు గౌస్ ఖాన్, శ్రీనివాసులు , ఆనంద్ , సుబ్బారెడ్డి , భార్గవ , ఆసిఫ్ , ఫయాజ్, అనిల్, మల్లికార్జున, కనికరం ప్రసాద్, శివశంకర్, ఆజంబాషారవి వర్ధన్ రెడ్డి , సుధాకర్, వీరేంద్రబాబు, రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ రెడ్డి, వెంకటరమణ, నాగప్ప ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

ప్రజాశక్తి-తలుపుల

సిఎం జగన్ పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఓబులరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి ఇంటి వద్దకే చేరువ చేస్తుందన్నారు. అందులో భాగంగానే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్, ప్రతి మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను అమలు చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టిన వైసిపిని ఆదరించాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పురం' దాహార్తి తీర్చిన ఘనత వైఎస్‌దే

హిందూపురం : హిందూపురం పట్టణ దాహార్తి తీర్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందని వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి కొనియాడారు. పట్టణంలోని ధర్మపురం సర్కిల్‌లో వార్డు ఇన్‌ఛార్జి మల్లికబాను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని శుక్రవారం ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆవిష్కరించారు. దీపిక మాట్లాడుతూ పట్టణంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో వైఎస్ రూ. 600 కోట్లు ఖర్చు చేసి నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి నీటి పథకం పేరుతో పిఎబిఆర్ నీటిని తీసుకొచ్చారన్నారు. అనంతరం అక్కడే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాధిక్, కౌన్సిలర్లు షాజియా, రహమత్‌బి, కిరోసిన్ బాబు, నాయకులు ఫరూక్, డిష్ చాంద్‌బాషా, తిమ్మారెడ్డి, ఇలియాజ్, సలావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో డిఎల్‌ఎస్‌సి కమిటీ సమావేశం నిర్వహించగా జెసి కార్తీక్, మైన్స్ ఎడి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు, ప్రభుత్వ పనులు, భవన నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. నదుల పక్కనే ఉన్నవారు సొంత అవసరాలకు ఎడ్ల బండ్లపై ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు ప్రతిపాదించామని, అయితే కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు ఇసుక విక్రయిస్తున్న వారికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కువ ధరకు ఇసుక అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పరిగి మండలంలోని సిగ్గుపల్లి వద్ద, తాడిమర్రి మండలంలోని నాయనపల్లిలో ఇసుక రీచ్‌లకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కరుణాసాగర్‌రెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, సెబ్ అధికారి రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రషీద్ ఖాన్, సంబంధిత మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రైతు దగా ప్రభుత్వం

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-రొద్దం

సిఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను దగా చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి మండిపడ్డారు. మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి, గౌరాజుపల్లి గ్రామాల్లో తీవ్ర వర్షాభావంతో ఎండిపోయిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ, కంది పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ. 30 వేలు పరిహారం అందించాలని కోరారు. టిడిపి ప్రభుత్వంలో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇచ్చి రైతులను ఆదుకున్నా మన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు ఇన్సూరెన్స్ కానీ, ఇన్‌పుట్ సబ్సిడీ కానీ ఇవ్వక పాపాన పోలేదని మండి పడ్డారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, సర్పంచి నాగరాజు, నారాయణ, రాజప్ప, కిష్టప్ప, అంజనప్ప, చిన్నవీరన్న, సతీష్, రైతులు ఉన్నారు.

కక్ష సాధింపు చర్యలు మాని రైతులను ఆదుకోండి : సవితమ్మ

సిఎం జగన్ కక్ష సాధింపు చర్యలు మాని రైతులను ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ హితవు పలికారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో సిద్ధప్ప సాగు చేసిన వేరుశనగ, కంది పంటలు, కొల్ల రైతు సిద్ధన్న సాగు చేసిన మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సరైన వర్షాలు కురవక పోవడం, అకాల వర్షాలు, విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు. ఆమె వెంట నాయకులు చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, జఫరుల్లా ఖాన్, ఆంజనేయులు, సూర్యనారాయణ, సోము, ప్రసాద్, నరసింహులు, వీరాంజనేయులు, గోపాల్, హనుమంతు, సుబ్రహ్మణ్యం, వెంకటరాముడు, తిరుపాల్‌నాయుడు, మారుతిప్రసాద్, త్రివేంద్రనాయుడు, మంజునాథ్, వాసుదేవరెడ్డి ఉన్నారు.

ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న బికె పార్థసారథి

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల పరిధిలోని గునిపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు.. గునిపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటిపైన నిద్రించాడు. మూత్రం పోయడానికి మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న టిప్పర్.. డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై శుక్రవారం మండల పరిధిలోని గంటాపురం క్రాస్ వద్ద టిప్పర్ వ్యాన్‌ను ఢీ కొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. ముదిగుబ్బ నుంచి కారును మరో వ్యాన్‌కు కట్టుకొని అనంతపురం తరలిస్తున్నారు. అదే సమయంలో అనంతపురం వైపు నుంచి ముదిగుబ్బకు బత్తాయి లోడుతో వెళ్తున్న నితిన్ సాయి కంపెనీకి చెందిన టిప్పర్ టైరు పగిలి ఆ వ్యాన్‌ను గంటాపురం క్రాస్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో అనంతపురం నగరానికి చెందిన వ్యాన్ డ్రైవర్ షబ్బీర్ వ్యానులో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. స్థానికులు, పోలీసుల సహకారంతో అతడిని నుంచి బయటకు తీసి వెంటనే ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. ప్రమాదంలో వ్యాన్‌తో పాటు కారు దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు. వ్యాన్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యోగివేమన జలాశయం నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపంలో ఉన్న యోగివేమన జలాశయం నుంచి దిగువ గ్రామాలకు శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి నీటి విడుదల చేశారు. ఎడమ, కుడి కాలువల ద్వారా నీరు విడుదల చేయడంతో 16 గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. చెరువులు నిండడం వల్ల బోర్లలో నీటి శాతం పెరుగుతుందని, ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు నీరందించవచ్చని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జలాశయం అధికారులు, వైసిపి మండల కన్వీనర్ సివి.నారాయణరెడ్డి, ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమలసేవేనాయక్, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, చెంద్రాయుడు, మస్తానమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పేదలపై నిర్లక్ష్యం తగదు : వ్యకాసం

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇల్లు, ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నెల రోజులుగా ఆందోళన చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్-353లో పేదల కోసం స్థలాన్ని కేటాయించామని అధికారులు చెబుతున్నారు. అయితే అక్కడ అలాంటి వాతావరణం కనిపించడం లేదన్నారు. అలాగే చిలమత్తూరు పంచాయతీ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు స్థలం కూడా గుర్తించని పరిస్థితి ఉందన్నారు. లబ్ధిదారులు, అర్హులకు ఒకేసారి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. అందరికీ సరిపడా భూమి సర్వే నెంబర్-805లో ఉందని కావున గుడిసెలు వేసుకున్న స్థలంలోనే పట్టాలు ఇవ్వాలని కోరారు. గుడిసెలు వేసుకున్న ప్రదేశంలోనే పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తే ఇళ్లు మంజూరు చేయాలని అక్కడే ఇళ్లు నిర్మించుకుంటారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఇంటి స్థలాల సాధన కమిటీ నాయకులు రామచంద్ర, లక్ష్మీనారాయణ, నరసింహా, చందు, శివ, మణి, చరణ్, రియాజ్, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎంతటి వ్యక్తులైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. కదిరి గ్రామీణ సిఐ కార్యాలయ ఆవరణలో శుక్రవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఇటీవల కాలంలో యువత చెడు మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తున్నారని, తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి సన్మార్గంలో నడిచేలా తీర్చిదిద్దాలన్నారు. గంజాయి, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాల సమాచా రం తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో పంటలను కాపాడుకోవడానికి పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం నేరమని, అతిక్రమిస్తే పదేళ్ల జైలు శిక్ష తప్పదన్నారు.

రూ. 3 లక్షల కర్నాటక మద్యం స్వాధీనం

కర్నాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రూ. 3 లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామీణ సిఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో తనకల్లు, నల్లచెరువు ఎస్ఐలు, సిబ్బంది చాకివేలు కూడలి వద్ద అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న సతీష్‌ను అరెస్టు చేసి ఓ వాహనాన్ని సీజ్ చేశారని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామీణ, పట్టణ సిఐలు వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి నల్లచెరువు ఎస్ఐ లింగమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

దళితుల హక్కుల కోసం కోటి సంతకాల సేకరణ

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, తదితర ప్రాం తాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. రమణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనుబంధ సంఘాలైన ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌తో కలిసి అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తున్నార న్నారు. దళితులకు మూడెకరాల భూమి, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, మహిళలపై అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు, ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్లు, తదితర 21 డిమాండ్ల సాధనకు సంతకాలు సేకరిస్తున్నామన్నారు. కోటి సంతకాలు సేకరించి డిసెంబర్ 4న భారత రాష్ట్రపతిని కలిసి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, పట్టణ అధ్యక్షులు అనూప్, అబ్రహం, విజయ్, మనోహర్, రాజేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కెవిపిఎస్ నాయకులు

ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్న రఘువీరారెడ్డి, కలశ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

ప్రత్యేకపూజల్లో పాల్గొన్న రఘువీరా, గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని పెనుకొండ రోడ్డులో వెలసిన కొల్లాపూర్ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన కలశం ఏర్పాటు కార్యక్రమాలకు సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వేర్వేరుగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కొల్లాపురమ్మ దేవి, మహేశ్వర దేవి, అమ్మవారి నూతన దేవాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన, కలశ స్థాపన, హోమం, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. రఘువీరా వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈశ్వరప్ప, నాగరాజు ఉన్నారు. గుండుమల తిప్పేస్వామి నిడగల్లు పీఠాధిపతి స్వామి ఆశీర్వాదం పొందారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షులు మనోహర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, కౌన్సిలర్ ఉమాశంకర్, తలమర్ల సుబ్బారాయుడు, ఓబులేష్, మాధవరాజు, భక్తర్, మంజునాథ్, డాక్టర్ కృష్ణమూర్తి, తిమ్మరాజు, రొళ్ల రామకృష్ణ, నాగరాజు ఉన్నారు.

పార్టీ ఆదేశాల మేరకే టిడిపిలో చేరాలి

ప్రజాశక్తి-మడకశిర

టిడిపిలోకి ఎవరైనా చేరాలంటే అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో కానీ, మండల కమిటీ ఆధ్వర్యంలో కానీ చేరాలని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలం పరిధిలోని వైబి.హళ్లి గ్రామపంచాయతీలో గురువారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న చేపట్టిన 'బాబుతో నేను' కార్యక్రమంలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప సమక్షంలో వైసిపికి చెందిన కరుణాకర్‌రెడ్డిని టిడిపిలోకి ఆహ్వానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈరన్నకు టిడిపిలో ఏ పదవి ఉందని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం ఈరన్నను ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగించిందన్నారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగయ్యగౌడ్, నాగరాజు, మారుతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, గిరి, రాజు, కుమార్, శీనప్ప, సుధాకర్, హనుమంతరాయప్ప, సత్యనారాయణ గుప్తా, ప్రసాద్, రామంజి, శివశంకర్, లక్ష్మీనారాయణ, మూర్తి, గుండప్ప, రామంజి, వెంకట్ శివారెడ్డి, ఆనంద్, వైబి.హళ్లి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపి గెలుపే లక్ష్యంగా దూసుకుపోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

2024 ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఇన్సూరెన్స్ ఎన్‌రోల్‌మెంట్, పార్టీ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. దీపిక మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి ప్రజలు టిడిపిని ఆదరిస్తున్నా నియోజకవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కేంద్రం 'అమృత్' పథకం ద్వారా విడుదల చేసిన నిధులను దారి మళ్లించడమే కాకుండా పురపాలక సంఘాన్ని అప్పుల పాలు చేసిన చరిత్ర టిడిపిది అన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్లు మహేష్‌జీను, మారుతి రెడ్డి, టౌన్ జెసిఎస్ కన్వీనర్లు శివ శంకర్ రెడ్డి, నౌషద్, రూరల్ కన్వీనర్ గిరి, లేపాక్షి కన్వీనర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, చిలమత్తూరు కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

29న గుంటూరులో దూదేకుల సింహగర్జన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

దూదేకుల హక్కుల కోసం నూర్‌బాషా/ దూదేకుల ముస్లిం సంఘం ఆధ్వర్యంలో గుంటూరు వేదికగా ఈ నెల 29వ తేదీ దూదేకుల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడెకంటి హైదర్ వలి తెలిపారు. ముదిగుబ్బలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింహగర్జనకు దూదేకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మహిళ, యువజన, జిల్లా, మండల నూరుబాషా దూదేకుల సంఘం కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 'చలో గుంటూరు' గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపి బాబు, హబీబ్, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సామాజికంగా, విద్యపరంగా, ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ప్రభుత్వం 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకాన్ని ప్రవేశపెట్టిందని సాంఘిక సంక్షేమ శాఖ డిడి శివరంగ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యుపిఎస్‌సి నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ. 1,00,000 ప్రోత్సాహకం అందిస్తామన్నారు. అర్హులు నవంబర్ 4వ తేదీ లోపు వెబ్‌లో కానీ, ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఒటిపి ఇతరులకు చెప్పొద్దు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పరిచయం లేని ఇతరులకు ఒటిపి సమాచారం ఇవ్వవద్దని ప్రత్యేకాధికారి శివారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. అమ్మఒడి పథకానికి సంబంధించి నిధులు మంజూరు చేస్తామని ఒటిపి నెంబర్ చెప్పాలంటూ అపరిచితులు ఫోన్ చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ పథకానికైనా ఒటిపి అవసరమైతే గ్రామ సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల వద్దకే వస్తారని, అప్పుడు మాత్రమే సిబ్బందికి ఒటిపి ఇవ్వాలన్నారు.

నేడు కదిరిలో కాంగ్రెస్ సభ

కదిరి టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం(నేడు) కదిరి పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు అహ్మద్ హుస్సేన్, కదిరప్ప తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే కుల జన గణన చేపట్టా లని, మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణం అమలు చేయాలని, బిసిలకు ఉపకోటా కల్పించాలని, తదితర అంశాలపై నిర్వహించబోయే సమావేశానికి ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హాజరవుతారన్నారు. ఈ తరుణంలో పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పల్లె పల్లెకి, వీధి వీధికీ ప్రచారం చేసేందుకు ప్రచార రథం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి పిఎస్ అహ్మద్ హుస్సేన్, కదిరి కన్వీనర్ అశ్వర్థ నారాయణ, సమన్వయకర్త నచ్చు బాలకృష్ణ యాదవ్, కదిరప్ప, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సేవలోనే సంతృప్తి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మానవ సేవ చేయడంలో సంతృప్తి ఉందని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్, నిర్వాహకులు తెలిపారు. ఓబుళమ్మ, చిన్నరామప్ప జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో 360 మందికి వైద్యులు, సిస్టర్ల ద్వారా భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. గర్భిణులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్ సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు తారకరామ నగర్‌లో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు, టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి జయప్రకాష్, హరినాథ్‌చౌదరి, సుధాకర్, కృష్ణ, శ్రీరాములు, రమణ, గంగాధర్, పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించాలన్నదే ప్రభుత్వ, సిఎం జగన్ లక్ష్యమని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దీపికా వేణు రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డితో కలిసి పాల్గొని వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా అర్హులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు రామచంద్ర, షాజియా, రహమత్ బి, మల్లికార్జున, నాయకులు ఫరూక్, డిష్ చాంద్‌బాషా, కృష్ణగౌడ్, తిమ్మారెడ్డి, షేక్ సహెరబాను, శివరాంరెడ్డి, జేమ్స్, చందు, అశోక్, స్రవంత్, పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ప్రతి ఒక్కరూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' సేవలను సద్వియోగం చేసుకోవాలని ఎంపిడిఓ అంజినప్ప సూచించారు. మండల పరిధిలోని బూరుగుపల్లి పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరంలో వైద్యులు ప్రమీల, కుమార్, విద్యాసాగర్, బాబాఫకృద్దీన్, ధర్మతేజ ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఎంఇఓ చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచి భాస్కర్, ఉప సర్పంచి శ్రీనివాసులు, ఎంపిటిసి కుమారి, కమ్యూనిటీ వైద్యాధికారి మీనాక్షమ్మ, లక్ష్మీదేవమ్మ, పార్వతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ్‌శేఖర్ పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దీపిక వేణు రెడ్డి

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకే పోటీలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్ తెలిపారు. స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో శుక్రవారం కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో 1-5వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఆర్ట్ ఫెస్టివల్ పోటీలు నిర్వహించారు. ఇందులో పిక్చర్ పెయింటింగ్, రంగోలి హే మోడల్ నేచురల్, తదితర డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని నవంబర్ 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి కొనియాడారు. పట్టణంలోని రెడ్డి భవన్‌లో శుక్రవారం రెడ్డి కమ్యూనిటీ ఆధ్వర్యంలో నల్లమాడ మండల పరిధిలోని పుల్లగూరపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి న్యాయవాది వృత్తిని ఎంచుకొని వృత్తినే దైవంగా భావించి పేదలకు ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లోకేశ్వర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ నాగేంద్రకుమార్‌రెడ్డి, రెడ్డి కమ్యూనిటీ సభ్యులు, న్యాయవాదులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దీపిక వేణు రెడ్డి

ఇబ్బందులు తెచ్చిపెట్టిన బాలుడి సరదా

ధర్మవరం టౌన్ : కడప నగరానికి చెందిన సందీప్‌కుమార్ ఎర్రముక్కలపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం సరదాగా తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్లే రైలు ఎక్కాడు. ఆ రైలు కదలడంతో దిగలేక గుత్తి రైల్వేస్టేషన్ చేరాక దిగాడు. అక్కడి నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కి ధర్మవరం స్టేషన్‌లో దిగి 1వ ప్లాట్ ఫారంపై ఉండగా జిఆర్‌పి ఎస్ఐ గోపీకుమార్, హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖానందరెడ్డి ఆ బాలుడిని విచారించగా జరిగిన విషయాన్ని తెలిపాడు. ఎస్ఐ బాలుడి తల్లి మేరీని ఇక్కడికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని అప్పగించారు. జిఆర్‌పి సిఐ నాగరాజు మాట్లాడుతూ దసరా సెలవులు కావడంతో పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొరపాటున దూరప్రాంతాలకు వెళ్లే రైలు ఎక్కి ఉంటే తల్లిదండ్రులు మానసిక క్షోభ పడతారన్నారు. అప్రమత్తంగా వ్యవహరించిన జిఆర్‌పి ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లను సిఐ అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : డిఆర్‌ఒ

పుట్టపర్తి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు. ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి 15 అర్జీలు అందాయి. డిఆర్‌ఒ మాట్లాడుతూ నిబంధనల మేరకే వినతులు స్వీకరిస్తామని, ఉద్యోగుల బాధలు, సమస్యలు తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర సమస్యలు, వ్యక్తిగత సమస్యలను కూడా అర్జీల ద్వారా సమర్పించవచ్చని, వాటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపుతామన్నారు.

కౌలురైతులకు రుణాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చినా బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని, సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట నష్టపోయినా పరిహారం కానీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందడం లేదన్నారు. కావున కౌలు రైతులకు ఎటువంటి గ్యారెంటీ లేకుండా రూ. లక్ష వరకూ రుణం ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు, లక్ష్మణ్ ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జూనియర్స్ బాల్ బాడ్మింటన్ జట్టుకు శుక్రవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని రామాపురం జడ్పి హైస్కూల్‌లో కోచింగ్ క్యాంప్ నిర్వహణకు సర్పంచి బండి సరస్వతి, బండి వీరనారప్ప దంపతులు రూ. 10వేలు అందజేశారు. చిత్తూరు జిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జట్టుకు 15 జతల క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం సర్పంచి దంపతులను పాఠశాల సిబ్బంది, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిడి లక్ష్మీనారాయణ, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఎంపిటిసి నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ పెదయ్య, పంచాయతీ సెక్రటరీ, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రతినిధులు బాబాఫకృద్దీన్, విజయ్‌కుమార్, నారాయణస్వామి, కోచ్ ధనుంజయ, ఉపాధ్యాయులు రవీంద్ర, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.NO:134/2022 in O.S.NO:30/2016

Between:
కొండపాక నరసమ్మ ...పిటీషనరు/వాది
V/S
సాకే హనుమంతు మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

5వ రెస్పాండెంటుకు నోటీసు

పై దావాలోని అర్జీలోని పిటీషనరు, అర్జీని 4వ రెస్పాండెంటు బత్తినేని రామలక్ష్మమ్మ గతించినందున ఆమె వారసుడుగా దావాలో 5వ రెస్పాండెంటుగా చేర్చుటకు 5వ రెస్పాండెంటు అయిన బత్తినేని కిరణ్ తండ్రి లేట్ నారాయణ, డ్రైవర్, బంగ్లా దగ్గర, ముదిగుబ్బ, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. అయిన నీ హాజరు నిమిత్తం పై అర్జీ పై కోర్టులో 30/10/2023 వ తేదికి వాయిదా వేయబడి ఉన్నది. నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలయునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:30/10/2023
స్థలం: కదిరి

ఇట్లు
పి.రవీంద్రబాబు, యమ్.ఎ., బి.ఎల్,
పిటీషనరు తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.NO:135/2022 in O.S.NO:30/2016

Between:
కొండపాక నరసమ్మ ...పిటీషనరు/వాది
V/S
సాకే హనుమంతు మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

5వ రెస్పాండెంటుకు నోటీసు

పై దావాలోని అర్జీలోని పిటీషనరు, అర్జీని 4వ రెస్పాండెంటు బత్తినేని రామలక్ష్మమ్మ చనిపోయినందున ఆమె వారసుడుగా 5వ రెస్పాండెంటు బత్తినేని కిరణ్ తండ్రి లేట్ నారాయణ, డ్రైవర్, బంగ్లా దగ్గర, ముదిగుబ్బ గ్రామం, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. అయిన నిన్ను సకాలంలో దావాలో చేర్చనందు పై కోర్టు వారు దావాలో అబెట్‌మెంట్ (Abatment) చేర్చనందున తిరిగి 5వ ప్రతివాదిగా చేర్చుటకు ఆలస్యమును మన్నించవలెనని అర్జీలో నీ హాజరు నిమత్తమై పై కోర్టులో 30/10/2023వ తేదికి వాయిదా వేయబడివున్నది. నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలుపుకొవలనని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:30/10/2023
స్థలం: కదిరి

ఇట్లు
పి.రవీంద్రబాబు, యమ్.ఎ., బి.ఎల్,
పిటీషనరు తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.NO:19/2008

Between:
ప్యాయల కదిరప్ప మరియు ఇతరులు ...వాదులు
V/S
సాకే నరసప్ప (Died) వారసులు మరియు ఇతరులు ...ప్రతివాదులు

48వ ప్రతివాదికి దావా సమను

పై దావాలోని వాదులు దావాను ప్రతివాదులపై విభాగానికి దావా వేసి యున్నారు. దావాలో 48వ ప్రతివాది హాజరు నిమిత్తమై దావా 31/10/2023 వ తేదికి వాయిదా వేయబడి వున్నది. 48వ ప్రతివాది అయిన చింతా దివాకర్ రెడ్డి తండ్రి సి.రామ చంద్రారెడ్డి, డోర్ నెం.4-79 మామిళ్లకుంట్లపల్లి H/o తిప్పేపల్లి, ఓబులదేవరచెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అయిన నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలుపుకొవలనని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:31/10/2023
స్థలం: కదిరి

ఇట్లు
పి.రవీంద్రబాబు, యమ్.ఎ., బి.ఎల్,
పిటీషనరు తరుపు వకీలు, కదిరి